క్లుప్తంగా

ఇంటి స్థలాలివ్వాలని వినతి

శంకరపట్నం: ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలివ్వాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు లింగాపూర్ గ్రామ దళితులు వినతిపత్రం అందించారు. అర్హులకు నివేశన స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారని చల్లూరి రాజకొంరయ్య తెలిపారు. మెట్‌పల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పేదలకు అందించాలని కోరినట్లు పేర్కొన్నారు.

సంక్షోభంలో విద్యారంగం



మాట్లాడుతున్న అజయ్

హుజూరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ఏబీవీపీ జిల్లా విభాగ్ కన్వీనర్ అజయ్ అన్నారు. పట్టణంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. గత ప్రభుత్వం రాష్ట్రంలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిని కొనసాగిస్తోందని ఆరోపించారు. సిద్దిపేట పట్టణంలో ఈనెల 23 24, 25ల్లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో విద్యారంగ సమస్యలపై ఆమోదించిన తీర్మానాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోసుకుల అజయ్, టౌన్ హాస్టల్ కన్వీనర్ అభిలాష్, కోకన్వీనర్ జస్వంత్, విజయ్, హరీశ్, భరత్, రంజిత్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభను విజయవంతం చేయండి

శంకరపట్నం: ఈనెల 30న నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే సీపీఐ మహాసభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య కోరారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయినందున ఆదివారం కొత్తగట్టు గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

రేపు పౌర హక్కుల దినోత్సవం

శంకరపట్నం: ముత్తారం గ్రామంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మండల స్థాయి అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు హాజరు కావాలని కోరారు.

సాగునీరు విడుదల చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జమ్మికుంట: యాసంగి పంటలకు జనవరి 1 నుంచి సాగునీరు విడుదల చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యాసంగికి జనవరి 1 నుంచి సాగునీటిని విడుదల చేస్తామని ప్రకటించిందన్నారు. నీటి విడుదలపై అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా.. జనవరి 1న నీటి విడుదల చేసి నల్లగొండ, సూర్యాపేట తదితర జిల్లాలకు పంపిస్తామని, వరంగల్, కరీంనగర్ జిల్లాలు, మిగతా ప్రాంతాలకు జనవరి 8న సాగునీటిని విడుదల చేస్తామని తెలుపుతున్నారన్నారు. రైతాంగం యాసంగి సాగు కోసం నార్లు పోసుకొని నీటి విడుదలకు ఎదురు చూస్తున్నారని, నార్లు ముదిరిపోయి దిగుబడి తగ్గి రైతులకు నష్టం వస్తుందని అన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఈత చెట్ల తొలగింపుపై ఫిర్యాదు



తొలగించిన ఈత చెట్లు, మొక్కలు

జమ్మికుంట: మడిపల్లి గ్రామం చింతలతోట తాటి వనం సమీపంలోని కాలువ పారుకం వొర్రె ఒడ్డుకున్న ఈత చెట్లు, ఈత మొక్కలను అక్రమంగా తొలిగించడంపై జమ్మికుంట ఎక్సైజ్ సీఐ మాధవిలతకు మడిపల్లి గీతా పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు వొల్లాల రాజు ఆధ్వర్యంలో శనివారం ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన అకుల కొంరయ్య అనే వ్యక్తి జేసీబీతో 150 నుంచి 200 ఈత చెట్లు, మొక్కలను తొలిగించారని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు, సభ్యులు కోరారు.

చండీయాగం



ఇల్లందకుంట: రాచపల్లి గ్రామంలోని శ్రీహరిహర క్షేత్రంలో శనివారం బ్రహ్మశ్రీ సువర్ణ శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో గ్రామం మార్మోగింది. బూస ఆది లక్ష్మి–అశోక్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

లక్కీ డ్రా విజేతకు బహుమతి ప్రదానం



చొప్పదండి: శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ పదో వార్షికోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన లక్కీ డ్రాలో గెలుపొందిన బొమ్మ శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఎలక్ట్రిక్ బైక్ అందజేశారు. వార్షికోత్సవ కార్యక్రమం అనంతరం లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. రెండో బహుమతి టీవీని కట్టికోల పద్మ, మూడో బహుమతి హోమ్ థియేటర్‌ను గడ్డం మహేశ్వర్ గెలుచుకోగా.. నిర్వాహకులు అందించారు. మరో 15 మందికి కన్సోలేషన్ బహుమతులు అందించినట్లు కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. గొల్లపల్లి శ్రవణ్‌కుమార్, చేపూరి సత్యనారాయణ, దండె సత్యానందం, ఎన్నం మునిందర్, మునిగాల సుధాకర్‌గౌడ్, పొరండ్ల భాస్కర్, మామిడాల నిరంజన్, చల్ల శివారెడ్డి, బైరగోని కిట్టుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన స్వాములు



గన్నేరువరం: గుండ్లపల్లికి చెందిన గురుస్వామి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడితో శబరిమల దర్శనానికి శనివారం తరలివెళ్లారు. 41 రోజుల దీక్ష అనంతరం మాల విరమణకు గురుస్వామితో పాటు చంద్రారెడ్డి, మహేందర్, సంజీవరెడ్డి తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, మహేశ్, రాజు, శ్రీనివాస్, రవీంద్రా, సుగుణాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆదిరెడ్డి వాహనంలో వెళ్లారు.

చైర్మన్ పీఠం ఎవరిని వరించేనో..

- ఇల్లందకుంట ఆలయ పదవి కోసం తీవ్ర పోటీ
- రేసులో ఇంగిలే రామారావు, కనుమల్ల రామకృష్ణ
- రామయ్య ఎవరిని కరుణిస్తాడో..
- మూడేళ్ల నుంచి పాలకవర్గం లేకుండానే బ్రహ్మోత్సవాలు
- మరో రెండు వారాల్లో ప్రకటించే అవకాశం



ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం

ఇల్లందకుంట: అపర భద్రాద్రిగా పేరొందిన శ్రీసీతా రామచంద్రస్వామి దేవస్థానం పాలక మండలి పీఠంపై ఉత్కంఠ నెలకొంది. మూడేళ్ల తర్వాత పాలక మండలి ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇటీవల విడుదల చేసింది. దీంతో ఆశావహులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. చైర్మన్ పాలక మండలి సభ్యులు సుమారు 20 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. గడువు ముగియడంతో ఆ శాఖ అధికారులు దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. పోలీస్ అధికారులు కూడా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. మరో రెండు వారాల్లో ప్రక్రియ పూర్తయ్యే అవకాశమున్నట్లు తెలిసింది.

ఇంగిలే రామారావు వైపే మొగ్గు

అధిష్టానం ఈసారి పార్టీకి సేవ చేసిన వ్యక్తికి చైర్మన్ పదవి కేటాయించాలని భావిస్తోంది. దీంతో జమ్మికుంటకు చెందిన వ్యాపారవేత్తలు కొందరు తమ పరపతి, పలుకుబడితో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కరీంనగర్ ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీకి కోసం కష్టపడ్డ కార్యకర్త కాకుండా జమ్మికుంటకు చెందిన వ్యాపారవేత్తకు ఇవ్వడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన చెందాయి. కొందరైతే బహిరంగంగానే విమర్శించారు. శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇంగిలే రామారావు, మండల కేంద్రానికి చెందిన కదారి కుమార స్వామి, కనుమల్ల రామకృష్ణ పేర్లు చైర్మన్ రేసులో ముందున్నట్లు కొద్దికాలంగా ప్రచారం సాగుతోంది. కానీ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు రామారావు వైపే మొగ్గు చూపుతున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే బ్రహ్మోత్సవాల నాటికి పాలకవర్గం ఏర్పడడం ఖాయంగా కనిపిస్తోంది.



ఇంగిలే రామారావు



కనుమల్ల రామకృష్ణ

వసతులు కరువు

ఆలయానికి వేలాది మంది భక్తులు వచ్చి దర్శించుకుంటారు. భక్తుల రాకతో ఆలయానికి ఆదాయం కూడా బాగానే ఉంటుంది. ఇలాంటి ఆలయానికి చైర్మన్ లేకపోవడంతో అభివృద్ధి అనుకున్నంత వేగంగా ముందుకు సాగడం లేదని, వసతులు సరిగా లేవని పలువురు మండిపడుతున్నారు. కాగా ఆలయ చైర్మన్ పదవి కొన్నేళ్లుగా ఖాళీగా ఉండడంతో ఆలయంలో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని రామయ్య భక్తులు వాపోతున్నారు.

వర్గ పోరుతో.. చైర్మన్ లేకుండానే..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న కాలంలో రెండు వర్గాలుగా ఏర్పడి రెండు వర్గాల్లోని ముఖ్య నాయకులు తమ వర్గానికి చెందిన వారికే కావాలంటే మా వర్గానికే కావాలంటూ పోటీ పడ్డాయి. చైర్మన్ పదవి కావాలంటూ ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌లకు చెందిన రెండు వర్గాలు కలిసి చైర్మన్ పదవి కోసం తీవ్రంగా శ్రమించాయి. ఈ క్రమంలో పాడి వర్గానికి చెందిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణరావుకు చైర్మన్‌గా ఉత్తర్వులు వచ్చాయి. దీంతో గెల్లు వర్గం తమ వర్గానికి చైర్మన్ పదవి దక్కకపోవడంతో చైర్మన్ ఉత్తర్వులను రాత్రికి రాత్రే చివరి క్షణంలో రద్దు చేయించడంలో గెల్లు వర్గం సఫలీకృతులయ్యారు. దీంతో ఇరువురి కొట్లాటతో స్వామివారి బ్రహ్మోత్సవాలు కాస్తా పాలకవర్గం లేకుండానే ముగిశాయి. కాంగ్రెస్‌లో కూడా ప్రతిసారి రెండు వర్గాల కొట్లాటతో అధిష్టానం సతమతమవుతోంది. ఈసారైనా ఎలాంటి వర్గపోరు లేకుండా ఏకాభిప్రాయంతో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తకు దక్కుతుందా లేదా పైరవీలు చేసే వ్యక్తికి ఇస్తారా లేకపోతే గతంలో జరిగిన మాదిరిగానే చరిత్ర పునరావృతమవుతుందా అనేది కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.





చొప్పదండి: పట్టణంలోని వీధి కుక్కలకు ఎలర్జీ సోకుతోంది. వాటి చర్మంపై మచ్చలు పెద్దగా మారుతున్నాయి. ఇది మనుషులకు సోకితే ప్రమాదకరంగా మారుతుంది. వ్యాధి తీవ్రత పెరగకముందే ఎలర్జీ సోకిన కుక్కలను గుర్తించి నివారించాలి. అధికారులు దృష్టి సారించాలి.

– సిరిపురం శ్రీనివాస్, చొప్పదండి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి, సెల్ నంబర్: 9949267882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

భూసారాన్ని కాపాడుకోవాలి



బ్రోచర్‌తో యోగేంద్రకుమార్, కొండూరి రవీందర్‌రావు, ప్రతినిధులు

మానకొండూర్: రసాయన ఎరువులను తగ్గించుకొని భూసారాన్ని కాపాడుకోవాలని భారతీయ సహకార సమితి జాతీయ చైర్మన్, మార్కెటింగ్ డైరెక్టర్ యోగేంద్రకుమార్, కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కేఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఇఫ్కో నానో ఎరువుల వినియోగంపై విత్తన ఉత్పత్తిదారులు, విత్తన ఆర్గనైజర్లకు శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడారు. రైతు సోదరులు తప్పనిసరిగా నానో ఎరువులను వాడాలన్నారు. డీఏవో భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ సైంటిస్టు గోపీనాథ్, సీడ్ మెన్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి రమణారావు, శ్రీనివాస్‌రెడ్డి, కపాశంకర్, కరీంనగర్ జిల్లా ఇఫ్కో మేనేజర్ బాలజీ పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడిలో చోరీ

జమ్మికుంట: గుర్తుతెలియని దుండగులు రూ.15వేల ఇత్తడి, రాగి వస్తువులు ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట గ్రామంలోని పెద్దమ్మ గుడిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గుడిలోని రూ.15వేల విలువ చేసే ఇత్తడి, రాగి వస్తువులు ఎత్తుకెళ్లినట్లు ముదిరాజ్ కుల పెద్దలు గుర్తించారు. ముదిరాజ్ కుల పెద్ద బోళ్ళ రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చొప్పదండి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్ఐ విజయ భాస్కర్ కోరారు. ఆర్నకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. కాన్షియస్నెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కేశవపట్నంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీ



శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం రాత్రి కేశవపట్నం, సైదాపూర్ ఎస్సైలు రవి, తిరుపతి సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులను పరీక్షించారు. మద్యం తాగి వాహనాలు నడపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సైలు తెలిపారు.

కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్

చిగురుమామిడి: మండలంలో గడిచిన సంవత్సర కాలంలో రూ.3.39కోట్ల విలువైన పనులు జరిగినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ముందు 15వ ఈజీఎస్ సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. రూ.22.09లక్షలు మెటీరియల్ కింద చెల్లించారన్నారు. కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.1.14లక్షల జరిమానా వేసినట్లు చెప్పారు. మస్టర్ల మీద సంతకాలు లేకపోవడం, ఎంబీ రికార్డులను ఆన్‌లైన్ చేయకపోవడం, ఇతరత్రా తప్పులు జరిగినట్లు, బాధ్యులైన వారి నుంచి రికవరీ చేస్తామన్నారు. ఈ సమావేశానికి ఈజీఎస్ కూలీలు హాజరు కాలేదు. తనిఖీ సిబ్బంది, 17 గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే హాజరయ్యారు. ఏపీడీ కృష్ణ, అంబుడ్స్‌మెన్ లక్ష్మీనారాయణ, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో మధుసూదన్, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి



మౌనం పాటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. సీనియర్ నాయకులు ఎండీ సలీం, ఎగ్గని శ్రీనివాస్, ఎండీ సలీంపాషా, వాసాల రామస్వామి, బండి మల్లేశ్, చిన్నింటి నాగేంద్ర, ఎండీ ఇమ్రాన్, పోతుల శ్రీనివాస్, గొట్టె ప్రభుదాస్, రాజమౌళి, ప్రవీణ్, శ్రీనివాస్, అయోధ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

జమ్మికుంట: పట్టణంలోని మోత్కులగూడెంకాలనీలో టీబీ నిక్షయ్ శివిర్ కాంపెయిన్‌లో భాగంగా టీబీ వ్యాధిపై డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, టీబీ సూపర్‌వైజర్ దేవేందర్‌రెడ్డి, ల్యాబ్ సూపర్‌వైజర్ చదువు కిరణ్, కోఆర్డినేటర్ తిరుపతి, ఏఎన్ఎం సరళ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఆశ కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల నిరసన



హుజూరాబాద్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించిన 104 ఉద్యోగులు

హుజూరాబాద్: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో శనివారం 104 ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా 104 ఉద్యోగులు జీతాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ సమస్యపై ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వంతో అనేక సందర్భాల్లో వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. బకాయి జీతాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. స్వప్న, చంద్రశేఖర్, వేణు, రాజీర్, శివకుమార్ పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	05	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	01	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	0	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	02	448
పార్వతీపురం స్పెషల్	01	672
పార్వతీపురం సాధారణ	03	336


– వేములవాడ

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

హుజూరాబాద్: పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాల సమీపంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పాడిశెట్టి అభిలాష్ జెండా ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. నాయకులు అజయ్, అరవింద్, లోకేశ్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, వెంకటేశ్, నవీన్ ఉన్నారు.



హుజూరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న అభిలాశ్



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

హుజూరాబాద్: పెద్దపాపయ్యపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఎలాంటి రక్షణ కంచెలు లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత కోసం పశువులు వస్తుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో రాత్రిపూట వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి



సర్వేలో పేరు నమోదు చేస్తున్న కమిషనర్ అయాజ్

జమ్మికుంట: ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలని వార్డు అధికారులకు మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 26, 28, 29 వార్డుల్లో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అధికారులు విధిగా ప్రతి ఇంటికి వెళ్లి సర్వే పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మేనేజర్ రాజిరెడ్డి, వార్డు అధికారులు పాల్గొన్నారు.